

సౌర విద్యుత్‌తోనే పర్యావరణ పరిరక్షణ 7లో.. పర్యాటకులను ఆకర్షిస్తున్న గొల్లవాగు ప్రాజెక్ట్

'వందే భారత్'కు హాల్టింగ్ ఇవ్వరూ..

- నాగ్‌పూర్- సికింద్రాబాద్ మధ్య సూపర్ ఫాస్ట్ రైలు
- రేపటి నుంచి రెగ్యులర్‌గా సేవలు
- మంచిర్యాలలో రైలు ఆపాలని డిమాండ్



మంచిర్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య నూతనంగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైలుకు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ రైలు మంగళవారం మినహా రోజూ నడవనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో వందేభారత్ రైలు సేవలు విశాఖ పట్నం-సికింద్రాబాద్, కాచిగూడ-తిరుపతి మధ్య నడుస్తున్నాయి. ఈ రెండు రైళ్లను దక్షిణ మధ్య రైల్వేకు కేటాయించారు. తాజా సర్వీసు సెంట్రల్ రైల్వే కేటాయించిన నాగ్‌పూర్ డివిజన్‌కు చెందినది. సోమవారం ప్రధాని నరేంద్రమోదీ ఈ రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు.

కేవలం 3 గంటల్లో రాజధానికి..

వందేభారత్ రైలు ఈ మార్గంలో నడపడాన్ని అంతా స్వాగతిస్తున్నారు. ప్రస్తుతానికి రామగుండంలో హాల్టింగ్ ఇవ్వడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్‌కు కేవలం మూడు గంటల్లోనే చేరుకోవచ్చు. తెలంగాణలో ఈ సర్వీసుకు రామగుండం, ఖాజీపేటలో మాత్రమే హాల్టింగ్ కల్పించారు. రోజూ ఉదయం 5 గంటలకు నాగ్‌పూర్‌లో (ట్రైన్ నంబరు 20101) బయల్దేరుతుంది. రామగుండంలో ఉదయం 9.15 గంటలకు చేరుతుంది. సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 12.15 గంటలకు ఉంటుంది. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు సికింద్రాబాద్ నుంచి (ట్రైన్ నెం.20102) బయల్దేరి రామగుండానికి మధ్యా హ్నం 3.15 గంటలకు చేరుకుంటుంది. 20 కోచ్‌లు ఉండే ఈ రైలు సోమవారం ప్రారంభించారు.

మంచిర్యాలలో నిలపాలని డిమాండ్....

వందేభారత్ రైలును మంచిర్యాలలో నిలపాలనే డిమాండ్ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వందేభారత్ రవాణా చార్జీలు కొంత అధికంగా ఉన్నా ఆర్టీసీతో పోల్చితే పెద్దగా తేడా ఏమీ లేదు. త్వరగా గమ్యస్థానం చేరాలనుకునే వారంతా వందేభారత్‌ను ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఈ రైలుకు ప్రస్తుతానికి రామగుండం, ఖాజీపేటలో మాత్రమే హాల్టింగ్ ఇస్తున్నారు. మంచిర్యాలలో ఇవ్వకపోవడంతో ప్రయాణికులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వందేభారత్‌కు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితోపాటు రైల్వే జీఎంకు లేఖలు రాశారు. మంచిర్యాలలో హాల్టింగ్ ఇస్తే కాగజ్‌నగర్ నుంచి బెల్లంపల్లి, తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఇక్కడి వచ్చే అవకాశం ఉంటుంది.

మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు అధిక సంఖ్యలో ప్రయాణం

మంచిర్యాల నుంచి ప్రయాణికులు అధిక సంఖ్యలో నిత్యం హైదరాబాద్ వెళ్తుంటారు. బస్సులో ప్రయాణించడం వల్ల అధిక సమయం వృథా అవుతోంది. మంచిర్యాల నుంచి రాత్రి సమయంలో ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారు. దీంతో ఆర్టీసీ లహరీ బస్సును ప్రవేశపెట్టింది. స్లీపర్ బస్సు కావడంతో దీనికి ఆదరణ ఉంది. అయితే తక్కువ సమయంలో వందేభారత్ రైలులో హైదరాబాద్ చేరే అవకాశం ఉంది.

వందేభారత్ రైలుకు రామగుండం నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు రూ.600ల పైచిలుకు ధరను నిర్ణయించారు. ఇంటర్‌సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్ తదితర సూపర్ ఫాస్ట్ రైళ్లతో పోల్చితే వందేభారత్ టికెట్టు ధరలు సుమారు నాలుగు రెట్లు అధికంగా ఉన్నాయి. ఆర్టీసీలో కొత్తగా ప్రవేశపెట్టిన లహరీ ఏసీ బస్సుల్లో సీటింగ్ టికెట్టు రూ.600ల పైగానే ఉండగా స్లీపర్‌కు రూ. 800 పైనే ఉంది. మంచిర్యాల నుంచి సికింద్రాబాద్‌కు బస్సులో ప్రయాణానికి కనీసం ఐదు గంటల సమయం పడుతుండగా వందే భారత్ రైలు ద్వారా నాలుగు గంటల లోపు చేరుకునే వీలుంది. సమయం కలిసి రావడంతో పాటు వాష్‌రూమ్స్ సౌకర్యం కూడా ఉండటంతో ప్రయాణికులు మొగ్గు చూపే అవకాశాలున్నాయి. మంచిర్యాల నుంచి కాజీపేట, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు నిత్యం వివిధ రైళ్ల ద్వారా మంచిర్యాల నుంచి కనీసం ఆరు వేల మంది ప్రయాణిస్తుండగా వారిలో కొందరు వందేభారత్‌ను ఆశ్రయించే వారు. ప్రయాణికులు మంచిర్యాల నుంచి గోదావరిఖని మీదుగా రామగుండం వెళ్లి అక్కడి నుంచి వందేభారత్ ఎక్కాల్సి ఉంటుంది. ఇది ప్రయాణికులకు అధిక వ్యయప్రయాసలను కలిగించే అంశం.

'వందేభారత్'కు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలి

- చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకుల నిరసన



రైల్వే స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 16: సికింద్రాబాద్ నుంచి నాగపూర్ నడిచే వందేభారత్ రైలును మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలని రైల్వే స్టేషన్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు ఆందోళన చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వారికి మద్దతు తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండా సుధాకర్, ఇరుకుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మంచిర్యాల రైల్వే స్టేషన్ ఏ గ్రేడ్ అయినప్పటికి ఇక్కడ ప్రధాన రైళ్లు నిలపకపోవడంతో వ్యాపారస్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వందేభారత్ రైలు మంచిర్యాలలో నిలిపితే ఈ ప్రాంత వాసులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్థానిక రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ త్వరలో రైల్వే మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి హాల్టింగ్ కోసం కృషి చేస్తానన్నారు. పెద్దపల్లి ఎంపీ సైతం పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తి హాల్టింగ్ కోసం కృషి చేయాలని కోరారు. నాయకులు ఇరుకుళ్ల శ్రీనివాస్, చంద్రశేఖర్ శెట్టి, జనార్దన్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ విజేత బూరుగుపల్లి

వేమనపల్లి, సెప్టెంబరు 16 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కబడ్డీ టోర్నమెంట్ విజేతగా బూరుగుపల్లి జట్టు నిలిచింది. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేమన యూత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోళి వేణుగోపాల్‌రావు సహకారంతో వేమనపల్లిలో పోటీలు నిర్వహించారు. 27 జట్లు పాల్గొనగా సోమవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. విజేత జట్టుకు రూ. 20 వేల నగదు, రన్నర్ జట్టుకు రూ. 10 వేల నగదు, షీల్డ్‌లు అందజేశారు. మాజీ సర్పంచ్ కుబిడె మధూకర్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడే వెంకటేశం, నాయకులు ఉప్పులపు సాయి, పురాణం లక్ష్మీకాంత్, కొండగొర్ల బాపు, మొండి, పాల్గొన్నారు.

కమిటీని వెంటనే రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

చెన్నూరు, సెప్టెంబరు 16: ఎస్సీల అభిప్రాయం సేకరించకుండా వర్గీకరణ అమలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయటం ప్రజాస్వామ్య విలువకు విరుద్ధంగా ఉందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బడికెల సమ్మయ్య, కార్యదర్శి బడుగురు తిరుపతి తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఇష్టారాజ్యంగా కమిటీ ఏర్పాటు చేయటం సరికాదన్నారు. ఈ కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. చెన్నూరు టౌన్ ప్రసిడెంట్ నవీన్, మండల అధ్యక్షుడు తోకల రమేష్, కోశాధికారి మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో లడ్డూ ధర

కాసిపేట, సెప్టెంబరు 16: కాసిపేట శివసాయి గణేష్ మండలి ముత్యంపల్లి లడ్డు రికార్డు ధర పలికింది. రైతు వేల్పుల పోశం రూ.1,15,116ను వేలం పాటలో దక్కించుకున్నాడు. కలశాన్ని ముత్యంపల్లికి చెందిన రైతు పుట్ట కుమార్ శేఖర్ రూ. 55,016కు దక్కించుకున్నారు. పత్యేక పూజలు నిర్వహించి లడ్డును వారికి అప్పగించారు.

రాత్రికి రాత్రి వెలిసిన

అక్రమ నిర్మాణం

బెల్లంపల్లి, సెప్టెంబరు 16: కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో గల జాతీయ రహదారి పక్కన డబుల్ బెడ్‌రూం ఇండ్లస్థలాలను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో ఆది వారం రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు వెలిశాయి. రాత్రి సమయంలో దాదాపు 2 గుంటల భూమి ఆక్రమించుకొని ఇంటి నిర్మాణాన్ని కబ్జాదారులు చేపట్టారు. దీనికి ఏకంగా ఇంటి నెంబర్‌ను సైతం నిర్మించిన ఇంటి ఎదుట రాశారు. సోమవారం సెలవు దినం కావడంతో ఇదే అదనపుగా కబ్జా చేసినట్లు తెలుస్తుంది. సంబంధిత రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో వెలసిన నిర్మాణంపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సి ఉంది.



ప్రభుత్వభూమిలో వెలసిన అక్రమ నిర్మాణం

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



గూడెం గోదావరి నది వద్ద నిమజ్జన ఏర్పాట్లు తెలుసుకుంటున్న సీపీ

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 16: గణేష్ నిమజ్జనోత్సవానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమ వారం మంచిర్యాల, లక్సెట్టిపేట పలు ప్రాంతాల్లో నిమజ్జనం, శోభాయాత్ర నిర్వ హించే ప్రదేశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నలుగురు ఏసీపీలు, 14 మంది సీఐలు, 19 మంది ఎస్సైలు, 183 ఏఎస్సైలు, 29 మంది మహిళా కానిస్టేబుల్లు, 366 కానిస్టేబుళ్లు, 75 మంది హోంగార్డులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మంచిర్యాల జోన్ పరిధిలో 2307 వినాయక విగ్రహా లు ఏర్పాటు చేయగా ఏడు నిమజ్జన కేంద్రాలు ఉన్నాయన్నారు. రాయపట్నం బ్రిడ్జి, గోదావరి పుష్కరఘాట్, మంచిర్యాలలో గౌతమేశ్వర మందిరం, సీతా రాంపల్లిలో ఇన్‌టెక్ వెల్, ఇందారం గోదావరి బ్రిడ్జి, చెన్నూరు పెద్ద చెరువు, బెల్లంపల్లిలో పోచమ్మ చెరువు తదితర ప్రాంతాల్లో నిమజ్జనం చేస్తారని చెప్పారు. ఫ్లడ్ లైట్లు, క్రేన్లు, ప్లాట్‌ఫాంలు, మంచినీటి వసతి, నిమజ్జనం జరిగే ప్రాంతంలో గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్య, నిమజ్జన శోభాయాత్రను డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తా మన్నారు. పిల్లలు, మహిళలు శోభాయాత్రలో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంతంగా నిమజ్జనం జరిగే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. డీజేలు, బాణా సంచా కాల్చడం నిషేధమన్నారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘ వేంద్రరావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్సెట్టిపేట, మంచిర్యాల సీఐలు నరేందర్, బన్సీలాల్, మున్సి పల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు దీపేష్‌రేన్వా పాల్గొన్నారు.

దండేపల్లి: గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీపీ శ్రీనివాసులు సూచించారు. గూడెం గోదావరి నది వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో గూడెం గోదావరి నది వద్ద నీటిమట్టం ఎక్కువ ఉందన్నారు. క్రేన్‌ల సాయంతో విగ్రహాలను నిమజ్జనం చేసేలా ఏర్పాటు చేశామన్నారు. వంతెన వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. గూడెం ఆటవీ చెక్‌పోస్టు నుంచి గోదావరి నది తీరం వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ మండలి నిర్వాహకులు, భక్తులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, ఎంపీడీవో ప్రసాద్, సీఐ అల్లం నరేందర్, ట్రాన్స్‌కో డీఈ ప్రభాకర్, ఎస్సైలు ఉదయ్‌కిరణ్, సతీష్, అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



గూడెం వద్ద గోదావరిలో గణేష్ నిమజ్జనం



బెల్లంపల్లి వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న రాకేష్ కుటుంబ సభ్యులు



కొత్తరోడ్డులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



మందమర్రి మండలంలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

ఘనంగా గణనాథుల నిమజ్జనం

- వైభవంగా శోభాయాత్రలు
- గూడెం, ఇందారం గోదావరి నదిలో నిమజ్జనం

దండేపల్లి, సెప్టెంబరు 16: తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని పూజించిన భక్తులు సోమవారం నిమజ్జనం చేశారు. గణనాథుల శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. భాజాభజంత్రీలు, మహిళల కోలాటాలు, యువత నృత్యాలు చేస్తూ ఊరేగించారు. గూడెం గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ముందుగా వినాయక మండ పాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. గోదావరి నది వద్ద అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గజ ఈతగాళ్లు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో ప్రసాద్, సీఐ అల్లం నరేందర్, ఎస్సైలు ఉదయ్‌కిరణ్, సతీష్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

నస్పూర్: నస్పూర్‌లో గణపతి నిమజ్జన శోభాయాత్ర ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల నుంచి పూజల అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. వాడవాడ సంబరాలు, ఒకరిపై ఒకరూ కుంకుమ చల్లుకుంటూ బాజాభజంత్రీలతో కోలాటా లు, నృత్యాల నడుమ యాత్ర సాగింది. చిన్న విగ్రహాలను సీతారాంపల్లి గోదావరి నది పుష్కర ఘాట్, పెద్ద విగ్రహా లను ఇందారం గోదావరి వంతెన వద్ద నిమజ్జనం చేశారు. ఎస్సై సుగుణాకర్ బందోబస్తు నిర్వహించారు.

జైపూర్: పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఇందారం గోదావరి నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఏసీపీ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌కాలనీలో వినాయక నిమజ్జనం నిర్వహించారు. గణనాథులను భక్తులు, యువత, చిన్నారులు ఆనందోత్సవాల నడుమ నిమజ్జనానికి తరలించారు.

కాసిపేట: కాసిపేట, ముత్యంపల్లి, ధర్మరావుపేట, మల్కెపల్లి, దేవాపూర్‌లలో నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాసిపేట, దేవాపూర్ ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

మందమర్రి రూరల్: వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి, మహిళలు మంగళ హారతులతో గణేషుడిని సాగనం పారు. లడ్డు, కలశాల వేలం నిర్వహించారు. శోభాయాత్రలో మహిళల కోలాటాలు, యువకుల నృత్యాలతో వినాయకుడిని నిమజ్జనం చేశారు.

భీమారం: మండలంలో నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. శోభాయాత్రలను నిర్వహించి కొత్త చెరువు వద్ద క్రేన్ సహాయంతో నిమ జ్జనాన్ని పూర్తి చేశారు.

జన్నారం: ఆర్యవైశ్య, వినాయక్ నగర్, పద్మశాలి సంఘంలతోపాటు పలు మండపాల వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. మహిళలు కోలాటాలు ఆడుతూ వినాయకుడిని తరలించారు. ఎస్సై రాజవర్ధన్ బందోబస్తు నిర్వహించారు.

మందమర్రి టౌన్: పట్టణంలో కొలువుదీరిన గణనాథులను మంచిర్యాల గోదావరికి తరలించి నిమజ్జనం చేశారు. దాదాపు 200 పైగా విగ్రహాలను క్రమ పద్ధతిలో తరలించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పూజలు నిర్వహించారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, కమిటీ నాయకులు సొత్కు సుదర్శన్, తిరుపతిరెడ్డి, అనంతచార్యులు, రాంరెడ్డితో పాటు ఇతర సభ్యులు విగ్రహాలకు కొబ్బరికాయలు కొట్టి స్వాగతం పలికారు. పోలీసులు ట్రాఫిక్ అంతరాయం జరగకుండా చూశారు. కోలాటాలు, డీజే పాటలతో నృత్యాలు చేశారు. లడ్డూ వేలంలు చేపట్టారు. మండప నిర్వాహకులకు బహుమతులు అందజేస్తామని ఉత్సవ కమిటి పేర్కొంది.

బెల్లంపల్లి : పట్టణంలో వినాయక నిమజ్జనం వైభవంగా జరిగింది. మహిళలు, చిన్నారులు, యువకులు శోభాయాత్రతో పోచమ్మ చెరువు వద్దకు వినాయకులను ట్రాక్టర్లు, ట్రాలీల్లో తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

తాండూరు: గణపతి లడ్డూ వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు మంగళ హారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు. సీఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బందో బస్తు నిర్వహించారు.

మంచిర్యాల కలెక్టరేట్: పట్టణంలోని 33 వార్డు లక్ష్మీ గణేష్ మండపం వద్ద సిద్దిబుద్ది సమేత గణపతి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సుమనవేణుగోపాల్, కేశెట్టి శ్రీదేవిశ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పండితులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. నూతికట్ల మధూకర్ సహకారంతో అన్నదానం నిర్వహించారు. సామాజిక సేవలో అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ మరింత ముందడుగు వేయాలని ఎస్సై సురేష్, హిందూ ఉత్సవ



మందమర్రిలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ నాయకులు



నిమజ్జన యాత్రలో పాల్గొన్న నాగార్జున కాలనీ వాసులు



రామకృష్ణాపూర్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



దండేపల్లిలో గణేష్ శోభాయాత్రలో మహిళలు



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ వంశీ కృష్ణ

పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా

అంతర్గాం, సెప్టెంబరు 16: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తాను అహర్నిశలు పాడుపడుతానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. సోమవారం రామగుండం రైల్వేస్టేషన్‌లో నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. రైల్వేశాఖ నూతనంగా వందేభారత్ రైలును ప్రవేశపెట్టగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా ప్రారంభోత్సవం చేయగా నాగాపూర్‌లో సాయంత్రం 5గంటకు ప్రారంభమైన రైలు రాత్రి 8.30గంటలకు రామగుండంకు చేరుకుంది. వందేభారత్ రైలు మంగళవారం మినహా ప్రతిరోజు నాగపూర్‌లో ఉదయం 5గంటలకు బయలుదేరి రామగుండంకు 9.10గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్‌కు 12.15గంటలకు చేరుకుంటుంది. వందేభారత్ రైలు రామగుండంలో నిలుపుదల చేయడానికి రైల్వేమంత్రిని కలిసి కోరానని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ ప్రజల దీవెనలతో పార్లమెంట్‌లో సమస్యలపై గళమెత్తుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రైల్వే ఉన్నతాధికారులు ఏడీఆర్ఎం రాజీవ్ గంగేలి, వామనమూర్తి, రజనేష్ కుమార్, రామగుండం సీపీశ్రీనివాస్, రవి, రాజమోహన్, ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్ గౌడ్, కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

10టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

● దర్జాగా ట్రక్కుల్లో తరలింపు ● పట్టుకున్న వన్‌టౌన్ పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16: గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు 10టన్నుల బియ్యాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. రామగిరి మండలం బేగంపేట కేంద్రంగా రేషన్ బియ్యంను మహా రాష్ట్రకు రవాణా చేస్తున్నారు. రేషన్‌షాపులు, గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని దర్జాగా తరలిస్తున్నారు. ఈ తరలింపునకు ట్రక్కులే కొనుగోలు చేశారు. ఆదివారం రాత్రి బేగంపేట నుంచి మహా రాష్ట్రకు ట్రక్కులో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు అడ్డుకున్నారు. టీఎస్22టీఏ1431 ట్రక్కులో 10టన్నుల రేషన్ బియ్యం, రేషన్ బియ్యం సరఫరాకు సివిల్ సప్లై వాడే గోనె సంచులు కూడా దొరికినట్టు తెలుస్తోంది. ట్రక్కును వన్‌టౌన్‌కు తరలించి ట్రక్కులో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు నెలల క్రితం కూడా బేగంపేటకు చెందిన రేషన్ బియ్యం మాఫియా మహారాష్ట్రకు తరలిస్తుండగా ట్రాలీలను పోలీసులు పట్టుకున్నారు.

సౌర విద్యుత్‌తోనే పర్యావరణ పరిరక్షణ

పైలెట్ ప్రాజెక్టుగా వెల్గనూర్ సోలార్ ప్రాజెక్టు ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, పాల్గొన్న కలెక్టర్ తదితరులు

దండేపల్లి, సెప్టెంబరు 16: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం వెల్గనూర్ గ్రామాన్ని సోలార్ విద్యుత్ ఉత్పత్తి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా విద్యుత్ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ద్వారా ఇంటింటికి విద్యుత్ సరఫరా, వ్యవసాయ మోటార్లకు కూడా సౌర విద్యుత్ ఇస్తామన్నారు. సోలార్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా నాణ్యమైన సౌర విద్యుత్ అందిస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామన్నారు. నియోజకవర్గం లో రూ.30 కోట్లు కేటాయించి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. రెబ్బనపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి మహిళలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సోలార్ పైలెట్ ప్రాజెక్టు ఎంపిక చేయడంపై గ్రామస్థులు కలెక్టర్, ఎమ్మెల్యేను సన్మానించారు. గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, డీఈ ఖైజర్, ఏడీఏ ప్రభాకర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చందు, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో ప్రసాద్, నాయకులు గడ్డం త్రిమూర్తి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సతీష్ , శంకరయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

కాసిపేట, సెప్టెంబరు 16: ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని సోమవారం ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఇంజనీర్లను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. అధ్యక్షుడు గొంది వెంకటరమణ మాట్లాడుతూ ఇంజనీర్లు భావితరాలకు నవ నిర్మాతలని, వారి కృషితోనే నూతన ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. హెచ్‌ఆర్ జీఎం ఆనంద్‌కులకర్ణి, కార్మికులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇంజనీర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు

పర్యాటకులను ఆకర్షిస్తున్న
గొల్లవాగు ప్రాజెక్టు


భీమారంలోని గొల్ల వాగు ప్రాజెక్టు

భీమారం, సెప్టెంబరు 16 : మండల కేంద్రంలో ఉన్న గొల్లవాగు ప్రాజెక్టు పర్యాటకులను ఆకర్షిస్తుంది. మండల కేంద్రం నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో గొల్లవాగు ప్రాజెక్టును 18 సంవత్సరాల క్రితం నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణంతో జల వనరులు పెరిగి వ్యవసాయ మండలంగా పేరుగాంచింది. వర్షాకాలంలో సందర్శకుల తాకిడితో గొల్లవాగు ప్రాజెక్టు నిత్యం ప్రజలతో కళకళాడుతుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు మత్తడి దూకుతుంది.

ఒక పక్క కొండలు, వృక్షాలు ప్రాజెక్టును ఆనుకుని ఉండడం వల్ల ప్రాజెక్టు పూర్తిగా ప్రకృతి ఒడిలో ఉంది. ప్రాజెక్టు కింద మామిడి తోటలు, పొలాలు చూస్తూ ఉంటే కనువిందు చేస్తుంది. ప్రాజెక్టుని ఆనుకుని అటవీ ప్రాంతం ఉండడంతో అటవీ శాఖ అధికారులు బర్డ్ వాచింగ్ దృశ్యాలను కెమెరాలో బంధిస్తుంటారు. అలాగే ప్రాజెక్టు ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు గజిబో అనే కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ గజిబో కేంద్రం నుంచి వివిధ జాతుల పక్షులు, జంతువులను వీక్షిస్తుంటారు.

గొల్లవాగు ప్రాజెక్టు పూర్తిగా ప్రకృతి ఒడిలో ఉండడం వల్ల చుట్టూ చెట్లు మధ్యలో ప్రాజెక్టు ఉండడంతో ప్రాజెక్టు నుంచి దూకుతున్న నీరు జాలువారుతూ అందంగా కనిపిస్తుంది. ప్రభుత్వం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా చేస్తే ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండడంతో పాటు ఆదాయం కూడా వస్తుంది.

ప్రాజెక్టుకు చేరుకోవడం ఇలా...

భీమారం ఆవడం క్రాస్‌రోడ్డు వద్ద దిగి నెన్నెల రోడ్డు మీదుగా సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో మామిడి తోటల మధ్య నుంచి వెళితే గొల్ల ప్రాజెక్టు కనబడుతుంది. గొల్లవాగు ప్రాజెక్టు ఖాజీపల్లి సమీపంలో గల పెద్దవాగు నుంచి ప్రారంభమై నర్సింగాపూర్ గ్రామం మీదుగా వచ్చే చిన్న వాగుతో కలిసి బూరుగుపల్లి వద్ద నుంచి వచ్చే మరో వాగుతో కలిసి ఒక ప్రాంతంలో మిళితమై వాగుగా ఏర్పడుతుంది. గొల్లవాగు ప్రాజెక్టును చూడడానికి వచ్చిన వారు ఇక్కడే విందు చేసుకుంటూ ఉత్సాహంగా గడుపుతున్నారు. కానీ ప్రాజెక్టు వద్ద రోడ్డు బురదమయంగా ఉండడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు.

అభివృద్ధి చేస్తే ప్రజలకు ఆహ్లాదం


ప్రాజెక్టు సమీపంలో జాలువారుతున్న నీరు

ఏకో టూరిజంగా అభివృద్ధి చేయాలి
రాపల్లి రాజన్న, భీమారం



గొల్లపల్లి వాగు ప్రాజెక్టును ఏకో టూరిజంగా అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. అలాగే ప్రాజెక్టు మీద రోడ్డును ఏర్పాటు చేసి రాత్రి వేళలో సైతం విద్యుత్ బల్బులు ఏర్పాటుచేస్తే ప్రాజెక్టు మరింత అందంగా కనిపిస్తుంది. వర్షాకాలంలో ప్రాజెక్టు వద్ద రోడ్డు బురదమయంగా మారుతుంది.

ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో పార్కు ఏర్పాటు చేయాలి
అరకాల రమేష్



గొల్లవాగు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో పార్కులను ఏర్పాటు చేస్తే సందర్శకులు మరింత ఎక్కువవుతారు. ప్రాజెక్టు కోసం వందల ఎకరాల భూములను ఇరిగేషన్ శాఖ తీసుకుంది. కానీ కొన్ని ఎకరాల భూమిని మాత్రమే ప్రాజెక్టు నిర్మాణానికి ఉపయోగించుకున్నారు. దీంతో మిగిలిన భూములు బీడు భూములుగా మారాయి. ఈ భూముల్లో పార్కులను ఏర్పాటు చేస్తే ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉం టుంది. ప్రభుత్వం గొల్లవాగు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చాలి.

ఎమ్మెల్యే వినోద్ జన్మదినం

బెల్లంపల్లి, సెప్టెంబరు 16: ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం వినోద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీపీ సీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, టీపీసీసీ ఇన్‌చార్జిను ఎమ్మెల్యే వినోద్ కలిశారు. ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

నెన్నెల: ఎమ్మెల్యే వినోద్ బర్త్‌డేను నిర్వహించారు. ఆయురారోగ్యాలతో ఉండాలని, మంత్రి పదవి రావాలని నాయకులు ఆకాంక్షించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, మోహీద్‌ఖాన్, గట్టు బానేష్, శ్రీనివాస్‌గౌడ్, మల్లాగౌడ్, కంపెల రమేష్, కొమ్ము రాజన్న పాల్గొన్నారు.

భీమిని: ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి జన్మ దిన వేడుకలను భీమినిలో నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గడ్డం మహేశ్వర్‌గౌడ్, ఎల్లాగౌడ్, శ్రీనివాస్, ప్రసాద్, రమేష్, జగదీష్, గాదం నవీన్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. మండల కేంద్రంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు అందజే శారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు పూస్కూరి వంశీ కృష్ణరావు, గడ్డం పురుశోత్తం, గోలేటి స్వామి, ముత్యాల రాజమౌళి, తాటిపాముల సాయికిరణ్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

గణనాథుడికి మహా నైవేద్యం



దండేపల్లి, సెప్టెంబరు 16: వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా దండేపల్లి రామాలయంలో శివ పావని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 108 రకాల నైవేద్యాలు, శివగణేష్ భక్త మండలి వినాయక మండపంలో ఆదివారం రాత్రి 108 దీపాలతో దీపారాధన పూజలు చేశారు. మండలంలోని పలు వినాయక మండపల వద్ద అన్నదాన వితరణ నిర్వహించారు.

గణేష్ శోభాయాత్రలో యువకుడి హల్‌చల్

చెన్నూరు, సెప్టెంబరు 16: చెన్నూరు పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో కత్తితో హల్‌చల్ చేసిన యువకుడితోపాటు ముగ్గురిని అరెస్టు చేసినట్టు సీఐ రవీందర్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. కొత్తగూడెం గణేష్ మండలి శోభాయాత్రలో తుమ్మ రమేష్ కౌన్సిలర్, అతని తమ్ముడు శ్యాం మరో వర్గానికి చెందిన ప్రణయ్, శివల మధ్య గొడవ జరిగిందన్నారు. తుమ్మ శ్యాం ఇంట్లోకి వెళ్లి కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించినట్టు తెలిపారు.

శోభాయాత్రలో విధులు నిర్వహి స్తున్న కానిస్టేబుల్ వినయ్‌కుమార్ ఇరువర్గాలను సముదాయిస్తున్నప్పటికీ తుమ్మ శ్యాం కత్తితో హల్‌చల్ చేశాడని తెలిపారు. కానిస్టేబుల్ వినయ్‌కుమార్‌కు కూడా గాయమైనట్టు వివరించారు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

మరో సంఘటనలో జెండావాడకు చెందిన గణేష్ మండలి నిర్వాహకులు పట్టణంలోని ఒక ప్రార్థన మందిరం వద్ద డీజేలతో నృత్యాలు చేస్తూ నినాదాలు చేశా రు. అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ శంకర్ వారించారు. మండలి నిర్వాహకులు శంకర్‌పై దాడికి దిగినట్టు వివరించారు. శంకర్ ఫిర్యాదు మేరకు సుంకరి శ్రావణ్, మహేష్, శ్రీకాంత్, కరొండ సాయితో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ రవీందర్ పేర్కొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన : ఇరువురిపై కేసు నమోదు

బెల్లంపల్లి, సెప్టెంబరు 16: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన 13 ఏండ్ల బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపారు. ఆదివారం రాత్రి బాలిక గాంధీనగర్‌లోని గణేష్ మండపం వద్ద అన్నదానం వద్దకు వెళ్లింది. అక్కడే ఉన్న గాంధీనగర్‌కు చెందిన ఏల్పుల నవీన్, చిప్ప హరీష్‌లు బాలిక చేయి పట్టుకున్నారన్నారు. అక్కడే ఉన్న బాలిక చిన్నమ్మ కొడుకు వారి నుంచి విడిపించి ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు


విశ్వకర్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం విశ్వకర్మ జయంతి వేడుకలను పురస్కరించుకొని విశ్వకర్మ విగ్రహప్రతిష్ఠాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహపూజ, అష్టోత్తరశతనామాలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నప్రసాదకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వబ్రాహ్మణసంఘం అధ్యక్షుడు పద్మకార్ మాట్లాడారు. మంగళవారం విగ్రహ నిమజ్జన కార్యక్రమం చేపట్టనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు, వేదపండితులు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో పూజలు


కాగజ్‌నగర్‌లో అన్నదానంలో భక్తులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16: వినాయక నవరాత్రుల ఘట్టం సోమవారంతో ముగిసింది. పట్టణంలోని ఏర్పాటుచేసిన 150గణనాథుల వద్ద సోమవారం పూజలు నిర్వహించారు. ప్రతి మండపంవద్ద హోమ కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే లక్కీడిప్ డ్రా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయంనుంచి రాత్రివరకు మండపాలుజనంతో రద్దీగా మారాయి.

వాంకిడి: మండలంలోని వివిధగ్రామాల్లో వినాయక మండపాలవద్ద సోమవారం అన్నదానకార్యక్రమాలను నిర్వహించారు. పలుగణేష్ మండపాలవద్ద ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుధ్యంపై పట్టింపేది?


రోడ్డుపక్కన చెత్తా,చెదారం

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 16: రోడ్లపై చెత్తాచెదారంతో పారిశుధ్యం లోపించినా అధికారులు పట్టించుకోవడం లేదు. బెల్లంపల్లి నుంచి చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే రహదారి మధ్యలో పోచమ్మ గుడి సమీపంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన చెత్తాచెదారాన్ని వేస్తుండడంతో అపరిశుభ్రత నెలకొంది. పందులు, కుక్కలు స్వైరవిహారం చేయడంతో దుర్వాసన వస్తోందని ప్రయాణీ కులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

పారిశుధ్యం మెరవాలి.. పల్లెలు మురవాలి

● నేటి నుంచి స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు


మురికికాలువ నుంచి చెత్త తొలగిస్తున్న కార్మికులు

వాంకిడి, సెప్టెంబరు 16: పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగునకు కేంద్రప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పంచాయతీల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను నేటినుంచి నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీకాగా ఈకార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలను రూపొందించారు. అక్టోబరు2న గాంధీ జయంతిని పురస్కరించుకొని గతేడాది ప్రధాని మోదీ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈఏడాది 18రోజులపాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మెరుగైనపారి శుధ్యంతో స్వచ్ఛగ్రామాలుగా మార్చాలని భావిస్తున్నారు. పారదర్శకతతో పూర్తిస్థాయిలో ముందుకెళ్తేనే జిల్లాలో పారిశుధ్య పనులు మెరుగుపడి అనుకున్న లక్ష్యం నెరవేరనుంది.

● నామమాత్రం పనులు కాకుండా..

స్వచ్ఛతాహీ సేవాకార్యక్రమాల్లో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలు సంపూర్ణంగా అమలుచేయాలి. కానీ అక్కడక్కడ కేవలం రహదారులపై చెత్తను ఊడ్చి, కాలువలో మురుగు తొలగింపువంటి నిత్యంచేసే కార్యక్రమాలనే నిర్వహించి మమ అనిపించారనే ఆరోపణలున్నాయి. ప్రారంభరోజుల్లో హడావుడి చేసి తర్వాత వదిలేస్తున్నారని, ఎక్కడా పారిశుధ్య పనులు వందశాతం పారదర్శకంగా జరగడం లేదనేది పల్లెప్రజలు పేర్కొంటు న్నారు. సెగ్రిగేషన్ షెడ్లలో చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారుచేస్తున్న పంచాయతీలను వేళ్లపైన లెక్కించవచ్చు. నిత్యం వినియోగిస్తున్న ప్లాస్టిక్, చెత్త అక్కడక్కడా రోడ్లపై దర్శనమిస్తునే ఉంది.పైగా పదిహేను రోజులు జరిగే స్వచ్ఛతాహీసేవ కార్యక్రమానికి ప్రత్యేకించి నిధులు వెచ్చించకపోవటం, నిత్యం చేసే పనేగా అనేనిర్లక్ష్యం ఉండడంకూడాఈ కార్యక్రమాలు వంద శాతం జరగపోవడానికి కారణమవుతుందనే చెప్పవచ్చు.

● చేపట్టే కార్యక్రమాలు..

- పంచాయతీ పాలకవర్గాలు, మండల ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, ప్రజలు శ్రమదానంతో పారిశుధ్యపనులకు శ్రీకారం చుట్టడం
- ఇళ్లనుంచి తడి, పొడిచెత్తను సేకరించి కంపోస్టు షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేయడం.
- తడిచెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేయడం.
- గ్రామాల్లోనిప్రధానకూడళ్లు, పంచాయతీభవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్తతొలగించడం.
- పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ చేయడం.
- గ్రామస్థులు వస్త్ర సంచులు వినియోగించేలా అవగాహన కల్పించడం.
- స్వచ్ఛతప్రాధాన్యంపై విద్యాలయాల్లో క్విజ్ పోటీల నిర్వహణ, విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించడం. పర్యాటకప్రదేశాల్లో సంపూర్ణంగా ప్లాస్టిక్ నిషేదం జరిగేలా చర్యలు తీసుకోవడం.
- ఒకసారి వినియోగించిన ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించచాలని అక్టోబరు 2న గ్రామసభల్లో తీర్మానాలు చేయడం.

ఎమ్మెల్సీ, మాజీఎమ్మెల్యేల పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

దహెగాం, సెప్టెంబరు 16: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పుప్పాల శ్రీనివాస్ తండ్రి, మాజీఉపసర్పంచ్ రాజయ్య ఇటీవల మృతిచెందడంతో కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వేర్వేరుగా పరామర్శించారు. వారివెంటనాయకులు సిడాంగణపతి, హర్షద్ హుస్సేన్, తిరుపతి, కమలాకర్, సత్యానారాయణ, సంతోష్ తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

మాలీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న మాలి కులస్తులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 16: ఎన్నికల సమయంలో మాలీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సోమవారం కాంగ్రెస్‌పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్‌తో కలిసి మాలికుల సంఘ నాయకులు మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. మాలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జిల్లాకేంద్రంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే జ్యోతీ బాపూలే భవనానికి నిధుల మంజూరుతోపాటు విగ్రహాల ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాలిసంఘం నాయకులు మారుతి, శంకర్, మారుతి, విశ్వనాత్, సోమాజీ, తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16: పట్టణంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు సోమవారం మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితులు ఎమ్మెల్యేతో వివిధ పూజాకార్యక్రమాలను చేయించారు.

బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సోమారం తిరుపతి


తిరుపతి

రెబ్బెన, సెప్టెంబరు 16: తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సోమారం తిరుపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర కమిటీలో ఆదిలాబాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్‌గా పనిచేస్తున్న తనను రాష్ట్రశాఖ సంయుక్త కార్యదర్శిగా ఎంపిక చేసినట్టు రాష్ట్ర అధ్యక్షుడు బంగారుస్వామి, ప్రధానకార్యదర్శి రమణ ఒక ప్రకటనలో తెలిపినట్టు వివరించారు. తనకు కీలకపోస్టు రావటానికి సహకరించిన ఆర్ నారాయణరెడ్డి షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


ప్రశంసాపత్రంతో మహేష్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 16: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ షెడ్యుల్డ్‌కులాల బాలల వసతిగృహంలో చదువుతున్న 8వతరగతి విద్యార్థి ఫైలా రఘుమహేష్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈనెల 14నుంచి 15వరకు హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా జట్టు తరపున పాల్గొని మొదటి స్థానం కైవసం చేసుకొని గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థికి ఎస్‌డబ్ల్యూవో తిరుపతి, సిబ్బంది ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థి మహేష్ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూవో తిరుపతి ఆర్థిక సహాయంతోనే తాను పతకం సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సంజీవ్, రమేష్, రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లిలో వర్షం

చింతలమానేపల్లి, సెప్టెంబరు 16: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. దీంతో మండలంలోని కర్జవెల్లి-గూడెం అటవీప్రాంతంలో ప్రధానరహదారిపై ఇరువైపులా ఉన్న చెట్లు నేలకొరిగాయి. వాహనదారుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి రాకపోకలకు అంతరాయం కలగకుండా వెంటనే విరిగినచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు


'సేవా పక్వాడ కార్యక్రమాలను విజయవంతం చేయాలి'

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 16: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఈనెల17నుంచి వచ్చేనెల2వరకు చేపట్టే సేవాపక్వాడ కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు తనను ఇన్‌చార్జిగా నియమించామన్నారు. తనతోపాటు బీజేపీ నాయకులు కోట్నాక విజయ్, కొంగ సత్యనారాయణ పాల్గొంటారన్నారు. 15రోజులు ప్రజలకు సేవలు చేస్తామన్నారు.

ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షామియానాలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 16: హైదరాబాద్ సంస్థానం స్వాతంత్ర్య భారతదేశంలో విలీనమైన సెప్టెంబరు 17ను ప్రజాపాలన దినోత్సవంగా రాష్ట్రప్రభుత్వం నిర్వహించనుంది. ఈనేపథ్యంలో మంగళవారం ప్రజా పాలన దినోత్సవానికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముస్తాబయింది. ఈ వేడుకలకు రాష్ట్ర శాసనమండలి డిప్యూటీచైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ హాజరు కానున్నారు. ఏర్పాటు పనులను అదనపుకలెక్టర్ దాసరి వేణుతో పాటు అధికారులు పర్యవేక్షించారు. వేడుకలు ఉదయం 9.30గంటలకు ప్రారంభం కానున్నాయి. ముఖ్యఅతిథిగా డాక్టర్ బండా ప్రకాష్ మొదట పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ఉదయం 10గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 10.25గంటలకు కార్యక్రమం ముగిస్తారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి


మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16: కాగజ్‌నగర్‌లో మంగళవారం జరిగే గణేష్ నిమజ్జనానికి పూర్తి ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానికంగా పోలీసు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లానుంచి 950మంది అదనపుపోలీసులతో నిమజ్జనం కోసం ఏర్పాటు చేశామన్నారు. 1200సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. నిర్వాహకులు గణనాథుడి విగ్రహం త్వరగా నిమజ్జనం చేసేందుకు కృషిచేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో డీఎస్పీ రామానుజం, సీఐ శంకరయ్య, శ్రీనివాస్, ఎస్సై డి రమేష్, మహేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సబ్ కలెక్టర్

మంగళవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా పెద్దవాగులో చేసిన ఏర్పాట్లను సోమవారం సాయంత్రం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాలు వెళ్లే దారులు, విగ్రహాలనువాగులోకి దించేందుకు ఏర్పాటు చేసిన క్రేన్‌లను పరిశీలించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, సిబ్బంది తదితరులున్నారు.

వినాయక పూజల్లో పాల్గొన్న డీఎస్పీ


పూజల్లో పాల్గొన్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16: పట్టణంలోని ఓం శ్రీ సాయిగణేష్ మండపంలో సోమవారం డీఎస్పీ రామానుజం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ వారు డీఎస్పీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో శంకరయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'దిబెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డు' అందుకున్న కిషన్‌రావు


కిషన్‌రావు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 16: కాగజ్‌నగర్ పట్టణంలో తొలిసారిగా ప్రయివేటు పాఠశాలను ప్రారంభించిన పెద్దపల్లి కిషన్‌రావుకు ఆల్ ఇండియా ప్రయివేటు స్కూల్ అసోసియేషన్(న్యూ ఢిల్లీ) ఆధ్వర్యంలో దిబెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డును ఆదివారం అందజేశారు. ఈ ప్రాంతంలో మూడు దశాబ్ధాలపాటు ఎంతో మంది విద్యార్థులను ఉన్నతస్థాయిలో నిలబెట్టినందులకు ఆయన ఈ అవార్డును దక్కించుకున్నారు. తనకు అవార్డు రావటం ఎంతో సంతోషంగా ఉందని విద్యాధరి సంస్థల కరస్పాండెంటెంట్ పెద్దపల్లి కిషన్‌రావు తెలిపారు.

ఆరోగ్య బీమా.. వృద్ధులకు ధీమా

- ప్రజావైద్యానికి కేంద్రం పెద్దపీట
- 70ఏళ్లు పైబడిన వృద్ధులకు ప్రయోజనం



వాంకిడి, సెప్టెంబరు 16: ప్రజావైద్యానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పేద, ధనిక తారతమ్యం లేకుండా 70ఏళ్లు పైబడిన వారందరికి రూ.5లక్షల ఉచిత వార్షిక ఆరోగ్యబీమా సౌకర్యాన్ని కల్పించే నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈమేరకు రూ.3.427కోట్లతో పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రమంత్రివర్గం బుధవారం ఆమోదు ముద్ర వేసింది. దీనివల్ల అన్ని సామాజికవర్గాల వృద్ధులకు వైద్య బీమా లభించనుంది. దరఖాస్తు చేసుకున్న వారికి నూతన కార్డులు జారీ చేయనుంది. దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా కేంద్రప్రభుత్వం ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జన్‌ఆరోగ్య యోజన (ఏబీ పీఎం-జేఏవై)ను 2018 నుంచి అమలు చేస్తోంది. తాజాగా ఈ పథకాన్ని 70ఏళ్లు పైబడిన వృద్ధులకు విస్తరించింది. ఆదాయంతో సబంధం లేకుండా వృద్ధులందరూ ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా పొందవచ్చు.

అర్హతలు..

- ఇప్పటివరకు ఈపథకం ఆర్థికంగా వెనుకబడిన కొన్నివర్గాల ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉంది. కేంద్రప్రభుత్వం తాజా నిర్ణయంతో ఆదాయంతో సంబంధం లేకుండా 70ఏళ్లు పైబడిన వృద్ధులం దరికీ కుటుంబం ఆధారంగా రూ.5లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది.
- ప్రైవేటు ఆరోగ్య బీమా ఉన్నవారికీ ఈపథకం వర్తిస్తుంది.
- ఇప్పటివరకు కేంద్రప్రభుత్వ హెల్త్ స్కీమ్(సీజీహెచ్‌ఎస్) ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రీబ్యూటరీ హెల్త్‌స్కీమ్(ఈసీహెచ్‌ఎస్) వంటి ఇతర పథకాలద్వారా ప్రయోజనం పొందుతున్నవారు వాటినే కొనసాగించ వచ్చు. లేదా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఎంచుకోవచ్చు.
- రాష్ట్ర ప్రభుత్వ బీమా పథకాలు పొందేవారికి వాటితో సంబంధం లేకుండా ఈ పథకం వర్తిస్తుంది.

వృద్ధులకు ప్రయోజనం..

వయసు పెరిగేకొద్దీ వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు వెంటాడుతాయి. ప్రస్తుతం వైద్యంపై చేసే వ్యయం సైతం భారీగా పెరిగిపోతున్న తరుణంలో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన రూ.5 లక్షల ఉచిత వార్షికఆరోగ్య బీమా పథకం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేలమంది వృద్ధులకు ప్రయోజనం చేకూరనుంది. ఆయా కుటుంబాలపై ఆర్థికభారాన్ని తగ్గించనుంది. అయితే ఈ పథకం ద్వారా ఒక కుటుంబంలో 70ఏళ్లు పైబడిన వారు ఒక్కరు ఉంటే రూ.5లక్షల వరకు బీమా వర్తిస్తుంది. అదే కుటుంబలో ఇద్దరు ఉంటే రూ.2.50లక్షల చొప్పున ఇలా.. కుటుంబంలో 70 ఏళ్లు పైబడినవారు ఎంత మంది ఉన్న వారందరికీ రూ.5లక్షలు సమానంగా వర్తిస్తాయి. ఇప్పటికే వేర్వేరు బీమా పథకాల్లో నమోదైన వృద్ధులు సైతం ఆయుష్మాన్ భారత్‌లో లబ్ధిపొందవచ్చు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ సదుపాయం అందు బాటులో ఉంటుంది.

అవగాహన కల్పించాలి

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం విధివిధానాలపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. 2018నుంచి ఈ పథకం అమలవుతున్నా అర్హులెవరనే దానిపై ప్రజల్లో స్పష్టత లేదు. అర్హులకు ఏఏ ఆసుపత్రుల్లో వైద్యం అందుబాటులో ఉంటుంది, బీమా ఎలా వర్తింపచేసుకోవాలి అనే అంశాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఎలాంటి ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా 70ఏళ్లు పైబడిన వారందరికీ ఈ పథకం వర్తింపచేయనుండడంతో దరఖాస్తు విధానం, బీమా పొందటంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పెంచికలపేటలో గణేషుడి సేవలో ఎమ్మెల్సీ దండె విఠల్


దహెగాంలో నృత్యాలు చేస్తున్న మహిళలు


ఆసిఫాబాద్‌లో మండపాల వద్ద విజేతలకు బహుమతులు

గణనాథుడికి ఘన వీడ్కోలు

- మండలాల్లో నిమజ్జన సంబరాలు
- లడ్డూలకు వేలం
- ఆసిఫాబాద్‌లోనూ పలు విగ్రహాల నిమజ్జనం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 16: తొమ్మిదిరోజులుగా పూజలు అందుకున్న గణేషుడిని సోమవారం నిమజ్జనం చేశారు. పలు మండలాల్లో నిమజ్జనం చేయగా ఆసిఫాబాద్‌లో కొన్ని విగ్రహాలను మాత్రమే నిమజ్జనానికి తరలించారు. ఆసిఫాబాద్ మండలంలో 42 మండపాలు ఏర్పాటు చేయగా అయిదురోజులకు కొందరు, 9రోజులకుమరికొందరు నిమజ్జనం చేశారు. పట్టణంలోని బాపునగర్, సరస్వతీశిశుమందిర్, రాజంపేట, బ్రాహ్మణవాడ, తదితరకాలనీల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. వివిధపోటీలకు సంబంధించి విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

శోభాయాత్ర సందర్భంగా మహిళలు ప్రత్యేక దుస్తులతో ఆడినకోలాటం ఎంతగానో ఆకట్టు కుంది. శిశుమందిర్ విద్యార్థులు చేసిననృత్యాలు అలరించాయి.

బెజ్జూరు/చింతలమానేపల్లి/పెంచికల పేట/ కెరమెరి/ దహెగాం/సిర్పూర్(టి) /తిర్యాణి: మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లో కొలువైన గణనాథులకు 9రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండపాలవద్ద అన్నదానం, లడ్డూవేలం నిర్వహిం చారు. మండపాలవద్ద భక్తులకు ప్రసాదాన్ని పంచి పెట్టారు. గణనాథులను ఎమ్మెల్సీ దండెవిఠల్, బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ దర్శించుకున్నారు. సిర్పూర్(టి)లోఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మె ల్యేను మండలి నిర్వాహకులు సన్మానించారు. అనంతరం గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో భాజాభజంత్రీల మధ్య సమీపవాగుల్లో నిమజ్జనం చేశారు.


ఆసిఫాబాద్ పెద్దవాగులో గణనాథుడి నిమజ్జనం


బెజ్జూరులో అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు


చింతలమానేపల్లిలో పూజలు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


చింతలమానేపల్లిలో వేలంలో దక్కించుకున్న లడ్డుతో భక్తులు

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బెజ్జూరు, సెప్టెంబరు 16: మండలకేంద్రంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి సోమవారం గ్రామస్థులు భూమిపూజ చేశారు. గతంలో నిర్మించిన పోచమ్మ ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్థులంతా చందాలు వేసుకుని నూతనంగా నిర్మించేందుకు సిద్ధ మయ్యారు. కార్యక్రమంలో పూజారి శ్రీనివాస్, గ్రామ స్థులు భాస్కర్‌రాజు, ఇస్తారి, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

సిర్పూర్(టి), సెప్టెంబరు 16: మిలాద్ ఉన్ నబీ పండగను పురస్కరించుకుని సోమవారం ముస్లిం యువకులు మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలో రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కీజర్‌హుస్సేన్, మాజీఎంపీటీసీ సోహెల్ అహ్మద్, అబ్దుల్లా, ముఖీద్‌హుస్సేన్, ఇజాజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వాహనాల్లో 64పశువులు

- పట్టుకున్న పోలీసులు
- 11మందికిపై కేసు నమోదు


పట్టుబడ్డ వాహనాలు, (ఇన్‌సెట్లో) వాహనాల్లో పశువులు

సిర్పూర్(టి), సెప్టెంబరు 16: సిర్పూర్(టి) పోలీసు స్టేషన్‌పరిధిలో సోమవారం తెల్లవారుజామున నాలుగువాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 64 పశువులను పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు నాలుగు వాహనాలను పట్టుకొని పరిశీలించగా అందులో 64పశువులు ఉన్నట్లు తెలిపారు. వాటిని మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. పశువులను స్వాధీన పర్చుకొని గోశాలకు తరలించినట్లు తెలిపారు. కాగా పశువులను తరలిస్తున్న నాగ్‌పూర్‌కు చెందిన సలీం ఖురేషి, షేక్‌తౌసిఫ్, షేక్ సోహైల్, షేక్‌తౌమిద్, మోసిన్ ఖాన్, షేక్‌నదీం, సచిన్, రాంటెంకి శైలేష్, షేక్ హనీస్, రమేష్‌కుమార్, ఎండీ యానిస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత

జైనూరు, సెప్టెంబరు 16: మండలకేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమవారం మూడుకిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్రలోని జివితి తాలూకాలోని సేవ్‌గాంకు చెందిన ముగ్గురు వ్యక్తులు వాహ నంలో మాలేగాంకు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న నితిన్, లియాకత్, దేవ్ రావుపై కేసునమోదు చేసి గంజాయిని స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు మృతి

చింతలమానేపల్లి, సెప్టెంబరు 16: మండల కేంద్రానికిచెందిన కొంపరి కిరణ్(28) ప్రమాదవశాత్తు పోచమ్మచెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కిరణ్ కు కొంతకాలంగా మతిస్థిమితం సరిగాలేదు. శని వారం రాత్రి ఇంటినుంచి బయటికి వెళ్లిన కిరణ్ సోమవారం పోచమ్మచెరువులో మృతిచెంది కనిపించి నట్లు తెలిపారు. మృతుడి తండ్రి సదయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపు తున్నట్లు తెలిపారు.



బెల్లంపల్లి ఏరియాలో పర్యటించిన డైరెక్టర్


ఓపెన్‌కాస్టు పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

రెబ్బెన, సెప్టెంబరు 16: బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఖైరిగూడ ఓపెన్‌కాస్టు ఉత్పత్తి తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గనిలోనికి వెళ్లి పనిస్థలాలు, నిల్వ నీరు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట జీఎం శ్రీనివాస్, ఎస్‌వోటు జీఎం రాజమల్లు, ఖైరిగూడ పీవో మచ్చగిరి నరేందర్, పీవో ఉమాకాంత్, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న పాల్గొన్నారు.

వరద బాధితులకు సీఎస్‌ఆర్ నిధులు అందించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 16: సింగరేణికి చెందిన సీఎస్‌ఆర్ నిధులను వరద బాధితులకు అందించాలని ఏరియా హెచ్‌ఎంఎస్ ఏరియా వర్క్‌షాప్ పిట్ కార్యదర్శి పొన్నగంటి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రవీందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల అనుమతి లేకుండా ఎవరికి కూడా వేతనంలో రికవరీ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చరణ్‌తేజ్, ప్రవీణ్, ఇతర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో ఘనంగా విశ్వేశ్వరయ్య జయంతి


మాట్లాడుతున్న ఎస్‌టీపీపీ ఈడీ

జైపూర్, సెప్టెంబరు 16: దేశంలోనే మొట్ట మొదటి ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని జైపూర్‌లోని ఎస్టీపీపీలో జాతీయ ఇంజనీర్స్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీపీపీ ఈడీ ఎన్‌వి రాజశేఖర్‌రావు పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశ్వేశ్వరయ్య మనందరికి స్ఫూర్తి దాయకమన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

కార్మికులు, ఉద్యోగులు క్షేమంగా ఉండాలి..

ప్లాంటులో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు క్షేమంగా ఉండాలని వినాయకున్ని కోరుకున్నట్లు ఎస్‌టీపీపీ ఈడీ ఎన్‌వీ రాజశేఖర్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మైసమ్మతల్లి దేవాలయంలో వినాయకుడి వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. వినాయక నిమజ్జనకార్యక్రమంలో భాగంగా టౌన్‌షిప్‌లో ఆలయకమిటీ సభ్యులతో కలిసి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసులు, జేఎస్ సింగ్, మదన్‌మోహన్, ప్రసాద్, సముద్రాల శ్రీనివాస్, ప్రభాకర్, ఠాకూర్ మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు సింగరేణి పెద్దపీట..

మహిళాసాధికారితకు సింగరేణి పెద్దపీట వేస్తుందని ఎస్టీపీపీ ఈడీ ఎన్‌వి రాజశేఖర్ రావు పేర్కొన్నారు. సోమవారం ఎస్టీపీపీలో నూతన టైలరింగ్‌బ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ప్రభావితగ్రామాలమహిళల కోసం సింగరేణిసేవాసమితి ఆధ్వర్యంలో స్వయం ఉపాధిశిక్షణను అందిస్తున్నట్లు చెప్పారు. నూతనంగా 25మంది మహిళలతో టైలరింగ్ బ్యాచ్‌ను ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సేవాసమితి కోఆర్డినేటర్ చిలుకఅరుణ, టైలరింగ్ శిక్షకురాలు రఫియా, సింగరేణి సేవాసమితి ఇన్‌చార్జి అధికారి ఠాకూర్‌మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మందమర్రి టౌన్, సెప్టెంబరు 16: ఈనెల17నుంచి కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన మాట్లాడారు. గనులు, డిపార్టుమెంట్ల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలన్నారు. సరియైన పద్దతిలో రికార్డులను భద్రపర్చడం, తదితర అంశాలు ఈ కార్యక్రమంలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం 14రోజులపాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రవిందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కార్మికులకు ఐఎన్టీయూసీ అండ

మందమర్రి టౌన్, సెప్టెంబరు 16: కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఐఎన్టీయూసీ ముందుంటుందని యూనియన్ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, దేవిభూమయ్య తెలిపారు. కేకే5 గనిపై వారు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్మికులకు సమస్యలు ఉంటే తమ డెలిగేట్‌లకు తెలియజేయాలన్నారు. అంతే కాకుండా పెద్దసమస్యలు ఉంటే తమ కార్యాలయానికి వస్తే లెటర్లు టైపు చేసి ఉన్నతస్థాయి అధికారులతో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.